
సిర్గాపూర్: నల్లవాగు ప్రాజెక్టులోకి చేరిన వరద


కోహీర్: గొటిగార్‌పల్లి పెద్దవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు


ఝరాసంగం : నీటితో కళకళలాడుతున్న జీర్లపల్లి చెరువు


కంది: వాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి


నాగల్‌గిద్ద: మావినెల్లిలో ఇండ్ల మధ్యలో చేరిన వరద


సిర్గాపూర్: అలుగు దుంకుతున్న వాసర్ ఊరవాగు చెరువు

# దంచికొడుతున్న వానలు

- స్తంభించిన జనజీవనం
- పొంగిపొర్లుతున్న చెరువులు, వాగులు, వంకలు
- నీటి మునిగిన పంటపొలాలు


హత్నూర: గుండ్లమాచునూర్‌లో..


అందోల్: కిచ్చనపల్లివద్ద అదుపుతప్పిన బస్సు

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అప్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా గెరువియ్యడం లేదు. ఫలితంగా జనజీవనం స్తంభించిపోయింది. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లపై నుంచి వరద ప్రవహిస్తుండంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావడం లేదు. మూగజీవాలు సైతం దొడ్లకే పరిమితమయ్యాయి. దంచికొడుతున్న వానలతో పంటపొలాలు నీట మునగడంతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వరదలకు చాలా చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల భారీ వృక్షాలు నేలకూలగా మరికొన్ని చోట్ల ఇండ్లు, గోడలు కూలిపోయాయి. భారీ వర్షాల నేపథ్యంలో పలు శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లల్లో ఉండకూడదని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, చెరువులు, కుంటల వద్దకు వెళ్లొద్దని, అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచిస్తున్నారు. ఎక్కడికక్కడ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వరద తీవ్రతను పరిశీలిస్తూ ప్రజలను హెచ్చరిస్తున్నారు.

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 1*


న్యాల్‌కల్: హద్నూర్‌లో చెరువును తలపిస్తున్న పంటపొలాలు


నారాయణఖేడ్: అలుగు దుంకేందుకు సిద్ధంగా గంగాపూర్ చెరువు


మునిపల్లి: చిన్నచెల్మడలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


న్యాల్‌కల్: రేజింతల్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడి వాగు


కల్హేర్: ఉధృతంగా ప్రవహిస్తున్న మహారాజువాగు


రాయికోడ్: ఇటిక్యాపల్లి శివారులో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు


అందోల్: జోగిపేటలో పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్



జిన్నారం: పీర్లా చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్


సదాశివపేట: మత్తడి దుంకుతున్న మెలిగిరిపేట చెరువు


బొల్లారం: సహాయక చర్యల్లో మాన్‌సూన్ టీం సభ్యులు



మునిపల్లి: బొడిశెట్పల్లి, లింగంపల్లి మధ్య రాకపోకలు నిలిపివేత


న్యాల్‌కల్: హద్నూర్‌లో నీట మునిగిన మినుము


న్యాల్‌కల్: మామిడివాగుపై రాకపోకలు నిలిపివేత


రామచంద్రాపురం: వెలిమెలలో కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్లు

## నేడు ప్రజావాణి రద్దు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 1: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 2న ప్రజావాణి రద్దు చేయడంతోపాటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కుంటలు, వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నందున అందరి శ్రేయస్సు దృష్ట్యా విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగవద్దని అన్ని విద్యా సంస్థలకు సెలవు, ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. భారీ వర్షాలు కురుస్తున్నందున అత్యవసరమైతే తప్పా ఎవరూ బయటకు రావద్దని, జిల్లా యంత్రాంగం నిరంతరం శ్రమిస్తుందని, ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## మహిళా ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సంఘం హెల్ప్ డెస్క్ ప్రారంభం

జిన్నారం, సెప్టెంబర్ 1: మండల కేంద్రం జిన్నారంలో బౌద్ధమార్గ్ ఆధ్వర్యంలో మహిళా ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సంఘం హెల్ప్ డెస్క్‌ను బౌద్ధ మార్గ్ ప్రతినిధులు ఆదివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థికాభివృద్ధికి సహకారం అందించేందుకు ఈ హెల్ప్‌డెస్క్ పని చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. సంఘంలో ఉచిత సభ్యత్వం అందిస్తామని, దినసరి వస్తువులు ఎమ్మార్పీ ధరల కంటే ఐదు నుంచి యాభై శాతం తక్కువ ధరలకు అందిస్తామన్నారు. సంఘంలోని సభ్యులకు రూ.2లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుందని, మరిన్ని వివరాలు స్థానిక కమ్యూనిటీ మిత్ర ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సురేశ్, తేజేశ్వరరావు, బీబీరెడ్డి, వైష్ణవి, రమేశ్ పాల్గొన్నారు.


## సీపీఎస్‌ను రద్దు చేసే వరకూ పోరాడుతాం


గొడుగుల సహాయంతో వర్షంలోనూ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 1: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు గుదిబండగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ టీజీఈజేఏసీ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కొత్త బస్టాండ్ వరకు వర్షంలోనూ గొడుగులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ జావిద్ అలీ, కోచైర్మన్ వైద్యనాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 1: పేదలందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, వర్షాలకు నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో మాట్లాడుతూ మూడేండ్లకోసారి నిర్వహించే సీపీఎం అఖిల భారత మహాసభల షెడ్యూల్ విడుదలైందన్నారు. ఎన్నికల సమయంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటికీ ఎవరికీ ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి శివకుమార్, సభ్యులు సుభాష్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అతిమేల మాణిక్

## 'ఆశ'లకు కనీస వేతనం ఇవ్వాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 1: ఆశ వర్కర్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నాయని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆశ వర్కర్లు పద్దెనిమిదేండ్లుగా పని చేస్తున్నా నేటికీ కనీస వేతనం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు వరలక్ష్మి, నాయకులు ప్రశాంతి, వీరమణి, పద్మ, లావణ్య, విజయలక్ష్మి, సునీత, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ, నాయకులు

## ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరుపై హర్షం

కోహీర్, సెప్టెంబర్ 1: జహీరాబాద్ ప్రాంతానికి ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్‌ను మంజూరు చేసినందుకు మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, తదితరులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. అనంతరం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి జహీరాబాద్ మీదుగా ముంబాయికి బుల్లెట్ ట్రెయిన్ మంజూరుకు కృషి చేస్తానన్నారు. అసెంబ్లీ కన్వీనర్ జగన్నాథ్, వైద్యనాథ్, భాస్కర్ పాల్గొన్నారు.

## గృహిణి ఆత్మహత్య

రామచంద్రాపురం, సెప్టెంబర్ 1: క్షణికావేశంలో వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూర్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన రాజ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో విధులు నిర్వహిస్తూ ఉస్మాన్‌నగర్‌లోని బీమ్యాక్‌లో భార్య సంగీతప్రియ(30), రెండు సంవత్సరాల పాపతో కలిసి నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. వెంటనే డోర్‌ని పగులగొట్టి సీపీఆర్ చేసి దవాఖానకు తీసుకువెళ్లారు. అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి తమ్ముడు కీర్తిరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేశ్ తెలిపారు.

## అప్రమత్తంగా ఉండాలి

**ఎస్పీ చెన్నూరి రూపేశ్**



సంగారెడ్డి, సెప్టెంబర్ 1: అల్పపీడనం కారణంగా జిల్లాకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసిందని, జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశించారు. ఆదివారం ఎస్పీ కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలని, పొంగి, పొర్లుతున్న వాగులు, చెరువులను చూడటానికి వెళ్లొద్దన్నారు. అత్యవసరమైతే డయల్ 100కు లేదా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739కు ఫోన్ చేయాలని సూచించారు. జలాశయాలు నిండుకుండలా మారే అవకాశం ఉన్నందున ప్రమాద కారణాల దృష్ట్యా ఎవ్వరూ చెరువులు, కుంటలను చూడటానికి వెళ్లరాదన్నారు. ఏదైనా ప్రమాదం తలెత్తినా, అత్యవసర సమయంలో స్థానిక పోలీసు స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌తో పరిస్థితులను ఎప్పటికపుడు తెలుసుకుంటూ పోలీసు యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, కుంటలకు చూడటానికి ఎవరినీ అనుమతించొద్దన్నారు. చెరువులు, కుంటల వద్ద ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేసే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎస్‌హెచ్‌వోల పరిధిలోని చెరువులు, కుంటలను సందర్శించి ఆనకట్టలు ప్రమాదం అంచున ఉన్నట్లయితే సమాచారం ఇవ్వాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు పంపాలని పోలీసు అధికారులకు సూచించారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, వైర్లను చేతులతో తాకవద్దని, నీరు నిల్వ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుంచి వెళ్లొద్దని సూచించారు. వాగులు, వంకలు, బ్రిడ్జిలపై నుంచి వరద పొంగి, ప్రవహించే సమయంలో దాటడానికి ప్రయత్నాలు చేయొద్దని, పాడైన పాత భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల పక్కన నివాసం ఉండొద్దని కోరారు.

## శిథిలావస్థకు చేరిన భారీ భవనం

**136 మందిని పునరావాస కేంద్రానికి తరలించిన అధికారులు**


ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌కు తరలించిన బాధితులతో తహసీల్దార్ భిక్షపతి

బొల్లారం సెప్టెంబర్ 1: కురుస్తున్న భారీ వర్షాలకు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న బస్తీలో నాలుగు అంతస్తుల భవనం శిథిలావస్థకు చేరిందని వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ఆదివారం భవనంలోని 40 గదుల్లో నివసిస్తున్న సుమారు 136 మందిని అధికారులు ఖాళీ చేయించి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌కు తరలించారు. బిల్డింగ్‌ను సీజ్ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రెండు రోజులపాటు వారికి సహాయక చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోలన్ రోజాబాల్ రెడ్డి ఆదేశించారు. ఆయా కుటుంబాలను చైర్‌పర్సన్,, కమిషనర్ మంగతాయారు, జిన్నారం తహసీల్దార్ భిక్షపతి పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఐటీయూతోనే కార్మికులకు రక్షణ

రామచంద్రాపురం, సెప్టెంబర్ 1: కార్మికులకు రక్షణగా సీఐటీయూ ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఆదివారం ఆర్సీపురం డివిజన్‌లోని బాలాజీ గార్డెన్స్‌లో తోషిబా పరిశ్రమ కార్మికుల విస్తృత స్థాయి సమావేశానికి హాజరయ్యారు. ఆయన సమక్షంలో ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్ యూనియన్ల నుంచి పలువురు కార్యకర్తలు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 11న తోషిబా పరిశ్రమలో జరుగబోయే కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు సీఐటీయూకి మద్దతు తెలుపాలని కోరారు.

## హద్నూర్ ఎస్ఐకి సీఐగా ఉద్యోగోన్నతి

న్యాల్‌కల్, సెప్టెంబర్ 1: మండలంలోని హద్నూర్ ఎస్ఐ రామనాయుడు సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు సంబంధిత జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు ఆదివారం అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టింగ్ ఎక్కడ ఇస్తారనేది త్వరలో తెలియజేస్తారన్నారు. రామనాయుడుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## రక్తదానం.. మహాదానం

గుమ్మడిదల, సెప్టెంబర్ 1: పుట్టినరోజును పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీహార్‌కు చెదిన సోనూ కుమార్ మండలంలోని బొంతపల్లి స్థిరపడ్డారు. బీఆర్ఎస్ మండల నాయకుడు శ్రీసుర్ణం చక్రపాణి, వివేకానంద యోగాగురువు భిక్షపతిరెడ్డి సహకారంతో నాగోలుకు చెందిన సదానంద బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పది మంది స్నేహితులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, నాయకులు కావలి శంకర్‌యాదవ్, సురభి వినోద్‌గౌడ్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.